# బీఆర్ఎస్ ప్రచార రథం సిద్ధం



గ్రామాల్లో తిరుగుతున్న ప్రచార రథం

హాలియా/త్రిపురారం, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వెళ్లి ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు వీలుగా రూపొందించిన బీఆర్ఎస్ ప్రచార రథం ఆకట్టుకుంటున్నది. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో రథం ద్వారా ప్రచారం చేపట్టారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే నోముల భగత్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను రథంపై ఏర్పాటు చేశారు. దాంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు అర్థమయ్యేలా ముద్రించారు.

# వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



త్రిపురారంలో అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

త్రిపురారం, అక్టోబర్ 25 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని శివాలయం, విద్యానగర్ కాలనీ, రామాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలకు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. కోలాటాలు, భక్తుల ఆట పాటలతో అమ్మవారిని ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను బుధవారం ప్రత్యేక వాహనంలో ఉంచి ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. అంతకు ముందు దుర్గామాత మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కలశాలు, లడ్డూ, చీరెలను వేలం వేయగా భక్తులు అధికంగా పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, జడ్పీటీసీ సలహాదారుడు పస్నూరి యుగేంధర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు వూరే జనార్దన్, కార్యదర్శి గౌరు వెంకటేశ్వర్లు, కోశాధికారి చందా ధనుంజయ్య, లక్ష్మయ్య, నరేందర్ పాల్గొన్నారు.

## హాలియాలో..

హాలియా : దుర్గాదేవి శోభయాత్రను బుధవారం హాలియాలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి హాలియా పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నాగార్జునసాగర్ జలాశయంలో నిమ్మజ్జనం చేశారు.



కొండమల్లేపల్లిలో దుర్గామాత శోభాయాత్ర

# ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటసిటీ, అక్టోబర్ 25 : నవంబర్ 30న జరిగే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే కోరారు. ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో కర్నల్ సంతోశ్‌బాబు చౌరస్తా నుంచి పీఎస్ఆర్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, గాంధీ చౌరస్తా మీదుగా నూతన బస్టాండ్ వరకు జిల్లా పోలీసు, కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం జిల్లా వ్యాప్తంగా పోలీస్ ఫ్లాగ్ మార్చ్ ఏరియా డామినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర బలగాల అధికారులు ప్రభాకర్ సింగ్, గణేశ్, జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, మహేశ్, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ పాలనలోనే గిరిజనుల అభివృద్ధి

- 29న నియోజకవర్గంలో మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటన
- ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్

హాలియా, అక్టోబర్ 25 : సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. ఈ నెల 29న నాగార్జునసాగర్ నియోజకవర్గంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం హాలియాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన సంఘం నాగార్జునసాగర్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరిజనులను ఓటుబ్యాంకు రాజకీయాల కోసం వాడుకున్నారే తప్ప వారి అభ్యున్నతికి పాటుపడిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే 500 జనాభా కలిగిన తండాలను గ్రామ పంచాయతీలుగా చేయడంతో పాటు 6 శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచారన్నారు. అసెంబ్లీ ఉప ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ గిరిజనుల కోసం హాలియాలో బంజారా భవన్ ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడంతో పాటు దానిని నెరవేరుస్తూ ఎకరం స్థలాన్ని కేటాయించారని పేర్కొన్నారు. హాలియాలో బంజారా భవన్ నిర్మాణం కోసం మంత్రి సత్యవతి రాథోడ్ రూ. 2 కోట్లు, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ కోటి రూపాయలను కూడా కేటాయించారని తెలిపారు. ఈ నెల 12న బంజారా భవన్ శంకుస్థాపనకు మంత్రి సత్యవతి రాథోడ్ సమయం ఇచ్చారని, కానీ ఆమె రాలేక పోయారని, అయితే మరుసటి రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తున్నందున.. ఆ కారణంగా బంజారా భవన్ పనులు ఆగిపోవద్దనే ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్‌ను శంకుస్థాపన చేయాలని మంత్రి స్వయంగా సూచించారని పేర్కొన్నారు. కానీ ఇవేమీ పట్టని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే గిరిజన భవన్ శంకుస్థాపన చేయడంపై అసత్య ప్రచారం చేయడం బాధాకరమన్నారు. 35 ఏండ్లు ఎమ్మెల్యేగా, 16 ఏండ్లు మంత్రిగా ఉన్న జానారెడ్డికి హాలియాలో బంజారా భవన్ ఏర్పాటు చేయాలనే సోయిలేకుండా పోయిందన్నారు. కానీ హాలియాలో భవన్ ఏర్పాటుకు స్థలం, నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వంపై, ఎమ్మెల్యే నోముల భగత్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీలో ఉన్న గిరిజన నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా నోముల భగత్‌కుమార్ విజయం కోసం కృషి చేయాలని కోరారు.

గిరిజనులను మభ్యపెట్టేందుకే చైతన్యయాత్ర


తాము అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులను పట్టించుకోని జానారెడ్డి, ప్రస్తుతం ఎన్నికల సమయంలో గిరిజనులను మభ్యపెట్టేందుకే తన కొడుకు జయవీర్‌రెడ్డితో గిరిజన చైతన్యయాత్ర చేపట్టారని అఖిల భారత గిరిజన సేవాసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కేతావత్ భిక్షానాయక్ అన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు గిరిజనులను ఎందుకు చైతన్యపర్చలేకపోయారని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాదం సంపత్‌కుమార్, పాక్స్ జిల్లా డైరెక్టర్ జయరాంనాయక్, పార్టీ మండలాధ్యక్షుడు రవినాయక్, ముడావత్ బాలాజీ, ఎంపీటీసీ రవినాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చందానాయక్, సుశీల్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్ రాజేశ్‌నాయక్, వివిధగ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గిరిజన నాయకులు

# ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 25 : ఎన్నికల నియమావళి పాటిస్తూ, విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు ఎ.వెంకట్‌రెడ్డి, సీహెచ్.ప్రియాంకతో కలిసి నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరుగకుండా పరిశీలించాలన్నారు. ఈవీఎంల ఫస్ట్ ర్యాండమైజేషన్ పూర్తయిందని సెకండ్, థర్డ్ ర్యాండమైజేషన్ త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల్లో పీడబ్ల్యూడీ ఓటర్స్ 80 ఏండ్లు నిండిన వయో వృద్ధులకు బీఎల్ఓలు 12డి దరఖాస్తులు ప్రతి ఇంటికి తిరుగుతూ ఓటర్ లిస్ట్ ప్రకారం వారిని గుర్తించి పోస్టల్ బ్యాలెట్ గురించి వివరించి అవసరమైనచో నమోదు చేసి 12డి వారికి అందజేయాలన్నారు. వృద్ధులు ఓటు హక్కు వినియోగం కోసం పోలింగ్ బూత్‌కు వస్తే ప్రభుత్వం వారికి రవాణా సదుపాయం కల్పించిందని, ఈ విషయాన్ని బీఎల్ఓలు పీడబ్ల్యూడీ ఓటర్స్, 80 ఏండ్లు నిండిన వృద్ధులకు తెలుపాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోరుతూ ఫారం 12డి దరఖాస్తులను స్థానిక ఎన్నికల అధికారికి నవంబర్ 8 లోపు సమర్పించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో నిరంతర తనిఖీలు చేపట్టాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు.

## సోషల్ మీడియా, బ్యాంక్ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి..

ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్, బ్యాంక్ లావాదేవీల మానిటరింగ్ సెల్‌లను ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డితో కలసి కలెక్టర్ వెంకట్రావ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా, పెయిడ్ న్యూస్, ప్రకటనలు, బ్యాంక్ లావాదేవీలపై ఈ మానిటరింగ్ సెల్‌ల ద్వారా ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలి..

సరిహద్దు చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలని కలెక్టర్ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంగళ, బుధవారం రూ.9 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. కోడ్ అమలు నుంచి ఇప్పటి వరకు రూ.57.20 లక్షల లిక్కర్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమంగా బెల్ట్ షాపులు నడుపుతున్న 181 మందిపై కేసులు పెట్టినట్లు వివరించారు. తనిఖీల్లో పాల్గొన్న టీమ్‌లతో మాట్లాడి దిశా నిర్దేశం చేశారు.